# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 18-01-2016**

హైదరాబాద్ హాస్పిటళ్లలో చికిత్స పొందే రోగుల సహాయకుల కోసం నగరంలో నైట్ షెల్టర్ల సంఖ్యను ఎక్కువ చేయాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు అభిప్రాయపడ్డారు. క్యాన్సర్ ఆసుపత్రితో పాటు పలు చోట్ల ఇప్పటికే నైట్ షెల్టర్ల ఏర్పాటు చేశామని, త్వరలో మరికొన్ని నిర్మాణం చేస్తామని వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులనే తేడా లేకుండా అన్ని చోట్ల నిర్మిస్తామని, వీటికి ఆసుపత్రుల యాజమాన్యాలు కూడా సహకరించాలని కోరారు.

బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి ట్రస్టు చైర్మన్, సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సోమవారం ఉదయం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా క్యాన్సర్ ఆసుపత్రి ద్వారా రోగులకు అందుతున్న సేవలను వివరించారు. బసవతారకం ట్రస్టు ఆధ్వర్యంలో క్యాన్సర్ రోగులకు సేవా దృక్పథంతో సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. రోగుల సౌకర్యార్థం ఆసుపత్రి ఆవరణలో పలు నిర్మాణాలు చేపట్టామని, వాటిని బిఆర్ఎస్ కింద క్రమబద్ధీకరించాలని బాలకృష్ణ సిఎంను కోరారు. దీనికి సిఎం సానుకూలంగా స్పందించారు. సేవా దృక్పథంతో రోగులను ఆదుకుంటున్న క్యాన్సర్ ఆసుపత్రి విషయంలో ప్రభుత్వం ఉదారంగా వ్యవహరిస్తుందని చెప్పారు.

రోగులకు వైద్య సేవలందించడంతో పాటు, వారి కోసం వచ్చే సహాయకులకు కూడా కనీస సౌకర్యాలు అందించే విషయంలో శ్రద్ధ చూపాలని ముఖ్యమంత్రి సూచించారు. సహాయకులు రాత్రివేళ నిద్రించడానికి షెల్టర్లు, స్నానం చేయడానికి, బట్టలు మార్చుకోవడానికి ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఆసుపత్రి నిర్వాహకులకు ఈ విషయంలో ప్రభుత్వం సహాయం అందిస్తుందన్నారు. నగరంలోని అన్ని ఆసుపత్రుల వద్ద ఇలాంటి

సదుపాయాలు ఉండేలా చేస్తామని చెప్పారు. ఈ విషయంపై త్వరలోనే ఆసుపత్రుల యాజమాన్యాలతో సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**